
# నీ నీడనే...

వేదాంతం శ్రీపతిశర్మ

ఏటా జరిగే ఎగ్జిబిషన్‌అది. ఎందుకో ఓ మూల గొడవగా ఉంది. పోలీసులు ఈలలు వేసుకుంటూ జనాన్ని వెళ్లిపొమ్మంటున్నారు. కొద్దిసేపు ఆ స్టాల్ దగ్గర వినోదం చూసి జనం ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఆ స్టాల్‌లో ఏదో సీనరీలు గోడకి అతికించి దాని ముందు ఫోటో కావాలనుకున్న వారికి ఫోటో తీస్తారు. స్టాల్ బయట ఓ జంట నిలబడి ఉంది. కొత్తగా పెళ్లయినట్లు ఉంది. పల్లెటూరు నుంచి వచ్చినట్లున్నారు. స్టాల్ వాడిచొక్కా పూర్తిగా చిరిగిపోయి ఉంది. సెక్యూరిటీ మనిషి అడిగాడు. ''ఏం జరిగింది?'' అతను పూర్తిగా భయపడి పోయినట్లున్నాడు. ఆ పల్లెటూరి మనిషి కండలు తిరిగున్నాడు.



''ఫోటో తీయమన్నాడు సార్. ఇద్దరూ ఆ సీనరీ ముందు ఒకర్నొకరు అంటుకుని నిలబడ్డారు సార్. కొద్దిగా జరగండీ, సీనరీలోని బిల్డింగ్స్ కరెక్ట్‌గా ఫోటోలో పడాలి అన్నాను''

సెక్యూరిటీ మనిషి బెంచ్ మీద కూర్చున్నాడు. ఎవరో అక్కడికొచ్చి నిలబడుతున్న వాళ్లని పొమ్మని సైగ చేశాడు. ఎందుకో నవ్వాడు.

'అంతమాత్రానికే నీ చొక్కా పట్టుకున్నాడా?'

'లేదు సార్ మరికాస్త దగ్గరకి జరిగి ఆమెని దగ్గరికి లాక్కున్నాడు. ఫుటో తియ్యి అని అరిచాడుసార్!'

'నువ్వు తీసేయ్యాల. చూడూ ఆళ్లు ఊరోళ్లు'

'నేను తీస్తానన్నాను సార్. ఇద్దరి నీడా ఆ బిల్డింగ్ మీద పడుతుంటే కొద్దిగా ఇద్దరినీ ఇటు జరగమన్నాను సార్'

'నీడ పడితే ఏమైంది? ఫోటో తియ్యాల' అలా అంటూనే అతను ఎందుకో మరల ఈల వేశాడు.

'నేను తీస్తునే ఉన్నాను. నీడ పడితే బాగుండదయ్యా అన్నాను సార్. అంతే!'

'ఏం చేశాడు?'

'ఏముందీ సార్, చొక్కా పట్టుకొని గుంజాడు సార్. ఇదిగో ఇలా చిరిగిపోయింది.'

సెక్యూరిటీ మనిషి ఆ పల్లెటూరు జంటను జాగ్రత్తగా చూశాడు.

'ఏవయ్యా నీడ పడుతోంది

అన్నాడు అంతే గదా?'

'నీడ పడితే ఏంటి సార్? ఎందుకు పడ కూడదు?'

'ఫోటో ఖరాబు అవుతుంది. అంతే!'

'ఆ బిల్డింగ్ మీద ... మా నీడ పడితే, ఫోటో ఎందుకు ఖరాబు అవుతుంది?'

'అబ్బా ఏందయ్యా ఇంతకీ ఫోటో తీశావా?'

'ఇదిగోండి సార్ తీశాను'

అతను ఫోటో చూశాడు. ' ఇదిగోనయ్యా ఫోటో పైసలిచ్చావా?'

'ఆ.... ఏది?' ఫోటో లాక్కున్నాడు.

'ఇక వెళ్లండి. గలాటా మాని తొందరగా ఇంటికె ళ్లండి'

ఇద్దరూ ఆ ఫోటో చూసుకుంటూ మురిసి పోతూ ఇవతలకి వచ్చారు.

***

మహానగరాన్ని వదిలి రైలు వెళ్లిపోతోంది. చిన్న చిన్న స్టేషన్లు, పెద్ద పెద్ద బోర్డులు, పరుగులు తీస్తున్న జనం... కిటికీకి ఆనుకొని మావ చక్కగా నిద్రపోతున్నాడు. ఈ మావకి ఇంత కోపం ఎందుకు? సుందరి మావలో అంత కోపం ఎన్నడూ చూడలేదు. దుర్మార్గులకి కోపం ఎక్కువని అమ్మ చెప్పేది. అమ్మో! మావ దుర్మార్గుడా? అయ్యో మావని ఏమీ అనకూడదు. మావ బంగారం. మరి అంత కోపం ఎందుకు? ఏమో! రైలు అలా పోతోంది. అసలు తనే పిచ్చిది. మెదలకుండా ఉండక పెళ్లయిన మొదటి రాత్రే పట్నం చూపించ మని కోరిక కోరింది. అసలు కోరికలు మంచివి కావని గుళ్లో పంతులుగారు అంటూంటారు. ఇందుకేనేమో! మావని జాగ్రత్తగా చూసింది. అమ్మో మరోసారి ఆడి చొక్కా పట్టుకొని ఉంటే ఏమైన ఉందా? చచ్చిపోయ్యే ఓడు పాపం... చల్లగా లికి నిద్ర వస్తూ ఉంది. కానీ తను పడుకుంటే తనని వేచి ఉండమన్నాడు మావ.

తేడా వస్తే నరికేస్తాడు. అలాగే కిటికీలోంచి చూస్తోంది. చంద్రుడు చిత్రంగా కదులుతూ వెంట వస్తున్నాడు.

నెల క్రితమే పెళ్లయింది. మావో మావో అంటూ పొలాల చుట్టూ ఎంత తిరిగేసినా ఎందుకో పెళ్లంటూ అయిపోగానే గడ్డివాములోంచి ఇవతలకి వచ్చిన దొంగ కోడిలా ఎక్కడి నుండో సిగ్గు ముందు కుదూకింది. పెరట్లో వేసిన పందిరి మంచం మీద దిష్టిబొమ్మలా కూర్చున్నాడు మావ. నా పక్కన ఎవరూ వద్దు అన్నట్లు మధ్యలో కూర్చున్నాడు. మంచమంతా అల్లి బిగించి గట్టిదనాన్ని పరీక్షిస్తున్న ట్లుంది గానీ ముద్దు ముచ్చట కోసం తయారయి నట్లు లేదు. తను మంచం చివర్న అటు తిరిగి కూర్చుంది. సామాన్యంగా స్త్రీలు జడ వేయించుకు నేటప్పుడు అలా నిటారుగా కూర్చుంటారు.

'పిల్లా నీక్కూడా సిగ్గే!'

'పో మావో!'

'పైకి జరుగే కింద పడతావేంటీ?'

'నాకు సిగ్గు ఎందుకుండ కూడదు మావా?'

'సిన్నప్పుడు నిన్ను ఎత్తుకున్నాను లెయ్యే!'

'అది నాకు తెల్దు మావా'

'ఆడ కూకోని ఏటి సేత్తన్నావేటి?'

'సెంద్రున్ని సూత్తున్నా మావా!'

'ఊర్లోకి కొత్తగా ఒచ్చిండా ఏం?'

'పో మావా!'

చేతులు రెండూ మొహానికి అడ్డం పెట్టుకుంది. ఎర్రగా పండిన గోరింటాకు వేళ్లు కొద్దిగా పక్కకి జరిపి ఇటు తిరిగింది.

'మావా!'

'ఏటే?'

'నువ్వట్టా కూకుంటే ఎట్టన్నావో తెల్సా?'

'సేతులు కిందకి దింపి సెప్పే! నేనేటి అనుకో ను'

'నువ్వు....నువ్వురాతిరేల మంచె మీద కూర్చొని కాపలా కాత్తున్నట్టున్నావు మావా! కల్లు కుండ ఒక్కటే తక్కువ'

' ఒసోస్... నీ కంటికి కాటిక బాలేదే పిల్లా... మసి పూసినట్లుందిలె'

'పో మావా!'

'నీ కళ్లు ఇంతే అని చెప్పినట్లుంది'

'నా కళ్లు ఎంత మావా?'

'కన్నార్పకుండా నన్ను పూర్తిగా నీ కంట్లో సూడు!'

'సూసా!'

'అద్దీ అంత పెద్ద కళ్లే నీయి!'

మావ దగ్గరకి లాక్కున్నాడు.

'గొప్ప'

'కాదేటి?'

'మావో'

'ఏటే'

'ఈ సెంద్రుడు పట్నంలో కూడా ఉంటాడా?'

'ఉంటాడే'

'ఏటి సేత్తాడేటి?'

'మబ్బుల్లోకి వెళ్తాడు, ఒచ్చేత్తాడు'

'ఆడ ఇళ్లలోకి వెళ్తాడు, ఒచ్చేత్తాడు'

లేచి కూర్చుంది.

'ఏటేటి? ఇళ్లల్లోకి ఎల్తాడా? ఎట్టా?'

'అవునే అంత పొడు గ్గుంటాయిలే మరి. నేల బారున పండుకొని సూత్తే ఆ బిల్డింగ్‌ల వెనుక దాక్కుంటాడు, ఒచ్చేత్తాడు'

'మావా!'

' ఏటే?'

'పట్నం సూత్తా మావా!'

'ఓస్ ఇంతేనా, ఆడ ఈ సెందురుడ్నే సూపి త్తా!'

కొబ్బరాకులు చల్ల గాలికి మీరు పడుకుంటే బావుంటుందన్నట్లు ఊగా యి.అదీ నిజమేనన్నట్లు ఆ చెట్ల చాటు నుంచి చంద్రుడు మరో సారి మెరిశాడు.

***

ఆ సందూ ఈ సందూ తిప్పి ఒక చాలా పెద్ద కాంప్లెక్స్ ముందు ఆపాడు మావ.

అందులోని వాచ్‌మెన్‌ను కేక వేశాడు. అతనూ గుర్తుపట్టి లోపలకి తీసుకెళ్లాడు.

'పిల్లా...'

'ఏటి మావా?'

'ఈతాత మనోడే. ఆ రోజుల్లో దండిగ పనిచేసే టోడ్డే. ఇయ్యాల ఇలా జొరం వచ్చిన పులిలా ఉన్నాడు. ఇగో తాతా, ఈమెకు ఊరు సూపిత్త న్నానే'

సూపియ్‌రా మనవఢా, సూపియ్ నిదానంగా వెళ్లు' ముసలాయన చుట్టముట్టించి నవ్వుకున్నాడు. ఇద్దరూ జాగ్రత్తగా పైకి ఎక్కి చివరి అంతస్తుకు చేరు కున్నారు.

సుందరి కళ్లు విప్పార్చింది.

'ఓలమ్మో!'

'సూసినావే! ఆ బిల్డింగ్ సూడు'

'అవున్లూ మావా దాని ఎనకాలే నువ్వు సెప్పి నట్లు చిన్నగా సెందురూడు పోతా ఉన్నాడు'


'మొద్దా! సెందురూడు కాదే, అది ఇమానం'

'ఎట్టా?'

'పిల్లా...'

'ఏటి మావా?'






'నేను నిన్ను ఈడకే ఎందుకు తెచ్చానో తెల్సా?'

'ఎందుకు మావా?'

'నేను ఈడనే పని చేశానే. ఏటి? చిన్నప్పుడు..... అల్లదిగో మైదానం. ఆడ ఎవురో మీటింగ్ సేత్తా వుంటే మా నాన్న, మీ తాత అందర్ని పట్టుకెళ్లాడట. అందరికీ ఆల్లు టిపినీలు పెట్టారు. అందరికీ ఏపైనా ఇళ్లు కట్టిపెట్టాలని నాన్న అడిగాడు. అట్లానే అన్నారు...'

'మీరు ఏడ ఆండే ఓరు మావా?'

'ఇదిగో..... ఈ పక్కనే మా గుడిసెలు. ఇలా ఒక్కో బిల్డింగ్ కట్టుకుంటూ, వీటి పక్కన మా గుడిసెల్లో ఉంటూ ఆటి నీడల్లా అలా ఎల్లిపోయే ఓల్లం. ఈటిల్లోకి ఎన్నడు ఎల్లం అదేం సిత్రమో!'

'ఎందుకంటావు మావా అట్టా?'

'పెద్దోల్లకి పేదరికం నీడలా ఉంటాదిలే పిల్లా. అది ఆడిని తాకదు. ఆడు తాకనీడు. దాన్ని తొక్కి పెట్టి బ్రతికేస్తాడు!'

'ఏటో మావా... కిందకి పోదాం...'

'ఇటు రా పిల్లా.. ఈ కింద సూడు'

'ఈడేముంది మావా?'

'ఈ పక్కకూ, ఆ పక్కకూ తడికేసి దాని మీద నడుస్తూ మా అమ్మా..నీ అమ్మమ్మా ఇదో ఇక్కడే జారి పడి అట్టానే పోనదిలే!'

ఇద్దరూ అలానే కిందకి చూస్తూ నిలబడిపోయారు. సుందరి మావని తీస్కొని కిందకి మెల్లగా దిగింది.

'ఏడ మావా పడిపోనాదన్నావు?'

'ఇలా. ఈడనే పిల్లా'

సుందరి మొకరిల్లింది. తన గాజులు తీసి అక్కడ పెట్టి నమస్కారం చేసుకుంది. మరల గాజులను తీసుకొని తొడుక్కుంది. ఇద్దరూ బరువుగా వాకిట్లోకి వెళ్లి పోయారు.

***

ఈ రైలు సాగిపోతోంది. చీకటి పడిపోయింది. అక్కడక్కడ లైట్లు మెరుస్తున్నాయి. మావ కొద్దిగా కదిలి మరల పడుకున్నాడు. నూర్పిడిలో పూర్తిగా మునిగిపోయినప్పుడు కూడా మావ పాట పాడుకుంటూనే ఉండాడు. ఏదైనా అన్నా ఎందుకో నవ్వుతాడు. మరేదైనా విన్నా నవ్వుకుంటూ వుంటాడు. ఏరోజు ఏదీ తవ్వుకోడు... ఎందుకింత కోపం వచ్చింది మావకి?

మావ కొద్దిగా కదిలాడు.

'మావా'

'ఏదీ?'

'ఎందుకు మావా సొక్కా పట్టుకున్నావు?'

మావ కళ్లు తెరిచాడు. చిరునవ్వు నవ్వాడు. 'కోపం వాడి మీద కాదే పిల్లా. ఇళ్లన్నీ సూసినావా! సూడు...అలా ఎల్లిపోతా ఉంటాయి. ఆటి పక్కనే నల్లని నీడలా ఆ గుడిసెలు. నా సిన్నప్పుడు ఇంతే. ఇప్పుడూ ఇంతే... ఆ పెద్ద కొంపల్లో ఆనోళ్ల పంట ఈ సిన్నోల్ల పనిమీదనే ఉంటది. ఈళ్లని మటుకు ఆళ్లు అంటనీరు. ఇది మారదు....'

'దానికి మనమేటి సేత్తాం మావా?'

'పిల్లా?'

'ఏటి మావా?'

'నిద్దరొచ్చిందేటే?'

'అవును మావా!'

'రా...పడుకో...పిచ్చిపిల్లా... నాకోసం కళ్లు ఇప్పుకొని కూకున్నావే?'

మావ గుండె మీద తల ఆన్చి పడుకుంది సుందరి. గాలి మరి కాస్త చల్లగా ఉంది. రైలు పరుగులు తీస్తోంది. చిన్నగా నిద్ర కళ్ల మీదకి వాలుతోంది. ఏదో అనిపిస్తోంది. ఏదో చెప్పాలనుంది. ఆలోచిస్తోంది.

'మావా! చిన్నగా అంది'

'ఏటే?' మెల్లగా అడిగాడు

'మనకు ఆ ఇళ్లు వొద్దులే మావా. అస్సలొద్దు!'

'సర్లే...పండుకో...నేను అడిగానా పిల్లా?'

'కోపం ఒద్దు మావా....'

'సర్లే...పండుకో.....పిల్లా!'

సుందరి కళ్లు మూసుకొంది. ఏదో ఆలోచించి మరల కళ్లు తెరచింది.

'మావా!'

'ఏ...దే'

'నేనేడా ఉండను మావా... ఈడనే ఉంటా.... నేనీడనే, నేనీడనే ఉంటా మావా..

'ఏటే!'

'ఇన్నావా?'

'సర్లే పండుకో'

రైలు పోతోంది. చంద్రుడు కూడా ఎందుకో మబ్బుల్లోంచి ఇవతలకి వచ్చి వాళ్లతో పాటు పట్నం నుంచి పల్లెకు వచ్చేస్తున్నట్లున్నాడు.

★